మేడే ఉత్సవాలను జయప్రదం చేయండి

సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - ఆకివీడు

ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే శ్రామిక ఉత్సవాలను వాడవాడలా నిర్వహించాలని సిఐటియ జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ పిలుపునిచ్చారు. మేడే కార్మికోత్సవాల సన్నాహక సమావేశం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సోమవారం యూనియన్ నాయకులు బి.ఆదాం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో గోపాలన్ పాల్గొని మాట్లాడారు. పారిశ్రామిక వాడల్లో ఆటలపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేయాలన్నారు. మేడే ప్రాధాన్యతను తెలిపి కుల మతాలకు వ్యతిరేకంగా ఈ ఉత్సవాలు నిర్వహించాలన్నారు. మేడే నాడు ప్రతి పని ప్రదేశంలోనూ జెండాను ఆవిష్కరించి, స్థానికంగా జరిగే బహిరంగ సభకు 9 గంటలకు హాజరు కావాలన్నారు. అనంతరం జరిగే భారీ ర్యాలీలో అన్ని రంగాలకు చెందిన కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ధాన్యం కొనుగోలులో రైతులకు చుక్కలు

లారీల ఏర్పాటులో ఖరీఫ్ నుంచి ఏమాత్రం నేర్వని పాఠాలు

ఏలూరు జిల్లాలో దాదాపు 50 శాతానికిపైగా మాసూళ్లు పూర్తి

కొనుగోలు చేసిన ధాన్యం కేవలం 25 వేల మెట్రిక్ టన్నులే

కళ్లాల్లోనే పంట.. అకాల వర్షాలతో రైతులకు దడ

ఉంగుటూరు, పూళ్ల, గుండుగొలనులో రోడ్డెక్కిన అన్నదాత

గుండుగొలనులో లారీల కోసం పురుగుమందుల డబ్బాతో ఆందోళన చేస్తున్న రైతులు

పౌర సరఫరాల శాఖ రూటే సెపరేటు..!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పౌర సరఫరాల శాఖాధికారులు రైతుల గురించి ఆలోచిస్తున్నారా.. లారీల సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారు. ఖరీఫ్‌లో ఎదురైన లారీల సమస్యను రబీలోనూ ఎందుకు కొనసాగే పరిస్థితి ఏర్పడింది. లారీలు లేక లక్షల టన్నుల ధాన్యం కళ్లాల్లోనే ఉండటానికి పౌరసరఫరాల శాఖాధికారులు కారణం కాదా.. అకాల వర్షాలకు ధాన్యం తడిస్తే పౌరసరఫరాల శాఖాధికారులు బాధ్యత వహిస్తారా.. రైతుల సమస్యను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా తమకే అన్నీ తెలుసు అనే ధోరణిలో పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి వ్యవహరించడమే దీనికి కారణమా అనే ఆలోచన ఏలూరు జిల్లాలోని రైతాంగాన్ని వెంటాడుతున్న పరిస్థితి నెలకొంది.

ధాన్యం కొనుగోలులో పౌర సరఫరాల శాఖాధికారుల తీరు రైతుల్లో చర్చనీయాంశంగా మారుతోంది. ముఖ్యంగా ఏలూరు జిల్లాలో ధాన్యం కొనుగోలులో వెంటాడుతున్న సమస్యలతో రైతులు విసిగిపోతున్నారు. అధికారుల తీరు కారణంగా అకాల వర్షాలకు ధాన్యం తడుస్తుండటంతో అన్నదాత ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. లారీలు పంపి ధాన్యం తరలించాలంటూ సోమవారం నాడు ఉంగుటూరు, పూళ్ల, గుండుగొలనులో రైతులు ఆందోళనకు దిగి, అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. రైతులను ఆదుకోవాలంటూ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నడిచే ఏలూరు స్పందన కార్యక్రమంలో ఎపి రైతుసంఘం నాయకులు వినతిపత్రం అందించారు. ధాన్యం కొనుగోలులో పౌరసరఫరాల శాఖ రైతుల గోడు ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఖరీఫ్‌లో సమస్యలే రబీలోనూ పునరావృతమవుతున్న తీరు ఆ శాఖ అధికారుల నిర్లక్ష్య ధోరణికి అద్దం పడుతుందనే చర్చ రైతుల్లో సాగుతోంది. ధాన్యం వెంటనే తరలించకపోతే చావే శరణ్యమంటూ పురుగుమందుల డబ్బాలతో రైతులు నిరసనకు దిగిన పరిస్థితి రావడం అత్యంత దారుణంగా చెప్పొచ్చు. రబీలో పశ్చిమగోదావరి జిల్లాలో 2.13 లక్షల ఎకరాల్లో, ఏలూరు జిల్లాలో 79,448 ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. ఇప్పటి వరకూ ఏలూరు జిల్లాలో 50 శాతానికిపైగా 40,860 ఎకరాల్లో మాసూళ్లు పూర్తయ్యాయి. కొన్ని మండలాల్లో 60, 70 శాతం కూడా మాసూళ్లు పూర్తయిన పరిస్థితి ఉంది. పశ్చిమలో 30 శాతం పూర్తయినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. పశ్చిమలో కంటే ఏలూరు జిల్లాలో రబీలో వరిసాగు దాదాపు లక్షా 50 వేల ఎకరాలు తక్కువ. ఏలూరు జిల్లాలో సాగు చేసిన వరి పంటకు సంబంధించి 3.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఈ ధాన్యం కొనుగోలుకు కూడా పౌరసరఫరాలశాఖ పిల్లిమొగ్గలు వేస్తోంది. ఇప్పటి వరకూ 50 శాతానికిపైగా పూర్తయిన మాసూళ్ల ప్రకారం చూస్తే దాదాపు రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కళ్లాల్లోనే ఉంది. ఇప్పటి వరకూ ఏలూరు జిల్లాలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా కొన్న ధాన్యం కేవలం 25 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే. ఇంకా కళ్లాల్లో లక్షా 75 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి.

లారీల సమస్య ఎప్పటికి తీరేనో..

ఈ నెల 16న ధాన్యం కొనుగోలును అధికారులు ప్రారంభించారు. అంటే దాదాపు పది రోజులు గడిచిపోయింది. ఇప్పటి వరకూ లారీల సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. లారీల కోసం రైతులు రోడ్డెక్కి ఆందోళన చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఒకపక్క అకాల వర్షాలు రైతులను వెంటాడుతున్నాయి. సోమవారం ఏలూరుతోపాటు పలుచోట్ల వర్షాలు కురిశాయి. మబ్బులు, గాలులతో నిండిన వాతావరణం రైతుల గుండెల్లో గుబులు రేపుతోంది. ధాన్యం తడిస్తే రైతుల పరిస్థితి మరింత దారుణంగా మారనుంది. ముఖ్యంగా నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు వంటి మండలాల్లో కొల్లేరు పొలాలు ఎక్కువగా ఉన్నాయి. ధాన్యం తడిస్తే ఇక్కడి రైతుల పరిస్థితి అగమ్యగోచరమే. పౌరసరపరాలశాఖ అధికారులు ఇప్పటికైనా లారీల సమస్యను పరిష్కరించి రైతులకు మేలు చేయాలని అంతా కోరుతున్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే కీలకం : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం



విస్సాకోడేరు సర్పంచికి ప్రశంసాపత్రం అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు సమృద్ధిగా ప్రజలకు అందించిన నాడే గ్రామాలు సస్యశ్యామలమై ఆహ్లాదకరమైన గ్రామాలుగా తయారవుతాయని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సోమవారం స్థానిక జిల్లా కలెక్టరేట్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ గ్రామాల్లో తడి, చెత్త పొడి చెత్తను వేరు చేసి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. గ్రామాల్లోని చెరువులను పునరుద్ధరించి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని సూచించారు. జిల్లాలో 22 గ్రామ పంచాయతీలకు అవార్డులు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. జిల్లా జాయింట్ కలెక్టరు ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎక్కువ అవార్డులు మన జిల్లాకే రావడం సంతోషమన్నారు. అవార్డులు పొందిన గ్రామ సర్పంచులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల్లో చెత్తను సంపద కేంద్రాలకు తరలించడంతోపాటు ప్లాస్టిక్‌ను నిషేధించాలని సూచించారు. అనంతరం జిల్లాలో వివిధ అంశాల్లో ప్రగతి సాధించిన 22 గ్రామ పంచాయతీల సర్పంచులకు సర్టిఫికెట్లు అందించి కలెక్టర్, జాయింటు కలెక్టర్, డిఆర్‌ఒ సత్కరించారు. కార్యక్రమంలో డిపిఒ మల్లికార్జునరావు, డిఎల్‌డిఒ కెసిహెచ్.అప్పారావు, నరసాపురం ఎంపిడిఒ శివప్రసాద్‌యాదవ్, వివిధ శాఖల అధికారులు, గ్రామ సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నరసాపురం రూరల్: గ్రామ పంచాయతీ వ్యవస్థ ఎంతో పటిష్టమైందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎంఎల్‌ఎ ముదునూరి ప్రసాదరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత గ్రామ స్వరాజ్యం కావాలని పిలుపునిచ్చిన జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ 2010 ఏప్రిల్ 24 నుంచి దేశంలో జాతీయ పంచాయతీ దినోత్సవాన్ని కేంద్ర, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ అధ్వర్యంలో జరుపుకుంటున్నామని వివరించారు. గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ ముఖ్యోద్దేశాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఎంపిపి, జెడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లపై ఉందన్నారు. ఈ సందర్భంగా ఎనిమిది విభాగాలు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో ప్రతిభను కనబరిచిన సర్పంచులకు అవార్డులను ప్రసాదరాజు బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మైలాబత్తుల సోనీ, జెడ్‌పిటిసి బొక్కా రాధాకృష్ణ, వైస్ ఎంపిపి ఉంగరాల రమేష్‌నాయుడు, దొంగ మురళీకృష్ణ, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

‘అంతర్గత నైపుణ్యాలను వెలికితీయాలి’

ప్రజాశక్తి - తణుకురూరల్

శివరామకృష్ణను సత్కరిస్తున్న యాజమాన్యం

విద్యార్థుల్లోని అంతర్గత నైపుణ్యాలను వెలికి తీస్తేనే మంచి తరాలను అందించగలమని విశాఖపట్నం గీతం యూనివర్సిటీ మాజీ విసి ప్రొఫెసర్ శివరామకృష్ణ అన్నారు. స్థానిక ఎస్‌కెఎస్‌డి మహిళా డిగ్రీ, పీజీ (అటానమస్) కళాశాలలో నాక్, ఐక్యూఎసి ఆధ్వర్యంలో స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా వారి సౌజన్యంతో పరిశోధనను పేటెంట్‌గా మార్చడం (కన్వర్షన్ ఆఫ్ రీసెర్చ్ ఇన్‌టూ పేటెంట్) అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ అధ్యక్షతన సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా శివరామకృష్ణ మాట్లాడుతూ ఏదైనా ఒక రంగంలో ప్రత్యేక పరిజ్ఞానంతో సమస్యను పరిష్కరించగలిగినప్పుడే అదే ప్రత్యేక వృత్తి నైపుణ్యం అవుతుందన్నారు. విద్య అనేది చుట్టూ వాతావరణాన్ని పరిశీలించడానికి, అవగాహన చేసుకోవడానికి, సాంఘికంగానూ, సాంకేతికంగానూ, సామాజికంగా ఎదగడానికి జీవితాంతం ఉపయోగపడేదే నిజమైన విద్య అని అన్నారు. విద్యార్థులు తమ డిగ్రీస్థాయి నుండే పరిశోధనా పట్ల అవగాహన ఉండాలని, మనలో ఉన్న సృజనాత్మకత మనదే అనే హక్కును పొందడమే పేటెంట్ అని అన్నారు. డీన్, సిడిసి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ నూతన విద్యావిధానంలో పరిశోధన అనేది నేటి విద్యార్థులకు చాలా అవసరమన్నారు. పరిశోధన అనేది జనజీవన స్రవంతిలో ఒక భాగమని, విద్యాసంస్థలు కూడా దీన్ని ప్రోత్సహించాలని అన్నారు. సదస్సు కన్వీనర్ డాక్టర్ ఎం.శ్రీదేవి మాట్లాడుతూ పరిశోధన, సృజనాత్మకత, పేటెంట్ ఈ మూడు నూతన అన్వేషణలకు మూలమని తెలిపారు. అనంతరం కళాశాల యాజమాన్యం చేతుల మీదుగా సదస్సు సావనీర్ ఆవిష్కరించారు. ముఖ్య అతిథులను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ చిట్టూరి సత్యఉషారాణి, విద్యా సంస్థల అధ్యక్షులు కోమట్లపల్లి వెంకటసుబ్బారావు, ట్రెజరర్ నందిగం సుధాకర్, పరిపాలనాధికారి డాక్టర్ డి.సుబ్బారావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ హిమబిందు పాల్గొన్నారు.

ఎపి సీడ్స్‌లో టెండర్ విధానం రద్దు కోరుతూ ధర్నా

ప్రజాశక్తి - తణుకు రూరల్

వినతిపత్రం అందిస్తున్న నేతలు, కార్మికులు

ఎపి సీడ్స్ తణుకు యూనిట్‌లో చట్ట విరుద్ధంగా ప్రవేశపెట్టిన టెండర్ విధానాన్ని రద్దు చేసి, పాత పద్దతిలో హమాలీ కార్మికులకు ఉపాధి కల్పించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎపి సీడ్స్‌లో టెండర్ విధానాన్ని రద్దు చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దారు కార్యాలయంలోకి చొచ్చుకుపోయి బైఠాయించారు. టెండర్ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించాలని, ఎపి సీడ్స్ తణుకు యూనిట్‌లో జరిగిన అక్రమాలపై విచారణ చేయాలని, కార్మిక చట్టాలకు విరుద్ధంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, సంస్థలో బయట జట్టుతో పని చేయించడం ఆపాలని, సీడ్స్‌లో కార్మిక చట్టాలు అమలు చేయాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ స్టేట్ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎపిఎస్‌ఎస్‌డిసి)లో 1971 నుండి హమాలీ కార్మికులు పని చేస్తున్నారన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రతి రెండు సంవత్సరాలకోసారి అగ్రిమెంట్ చేసుకుని మార్చి వరకు పనిచేశారన్నారు. ఎపి సీడ్స్ అధికారులు కార్మిక చట్టాలు పాటించకుండా యూనియన్ వారితో అధికారిక చర్చలు చేయకుండా కనీసం నోటీసు ఇవ్వకుండా ఏకపక్షంగా టెండర్ విధానం ప్రకటించారని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా 18 యూనిట్లు సంస్థకు ఉన్నాయని, వాటిలో ఎక్కడా లేని టెండర్ పద్ధతి కేవలం కార్మికులపై కక్షసాధింపులో భాగంగానే ఇక్కడ పెట్టారని విమర్శించారు. టెండర్ ప్రక్రియ కూడా పారదర్శకంగా జరగలేదన్నారు. తణుకు యూనిట్‌లో జరుగుతున్న అవినీతి కార్యక్రమాలను ప్రశ్నిస్తున్నారని హమాలీ కార్మికుల అడ్డుతొలగించుకోవడానికే ఈ టెండర్ విధానాన్ని పెట్టారన్నారు. గతం నుండి పని చేస్తున్న హమాలీ కార్మికులకు నష్టం చేసే టెండర్ విధానం రద్దు చేసి కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అడ్డగర్ల అజయకుమారి, నేతలు గార రంగారావు, కామన మునిస్వామి, టిరామకృష్ణ, జి.త్రిమూర్తులు, బి.శ్రీహరి, కె.వెంకటరమణ, యు.సూరిబాబు, నీలాపు ఆదినారాయణబాబు పాల్గొన్నారు.

ఆప్యాయతకు మారుపేరు.. సర్రాజు

మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - కాళ్ల



సర్రాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి ధర్మాన

మాజీ ఎంఎల్‌ఎ పాతపాటి సర్రాజు ఆప్యాయతకు మారుపేరని రాష్ట్ర రెవెన్యూ శాఖామంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. భీమవరం ఆదర్శనగర్‌లో పాతపాటి సర్రాజు స్వగృహానికి సోమవారం విచ్చేసిన మంత్రి తొలుత సర్రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలర్పించారు. అనంతరం సర్రాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రసాదరావు మాట్లాడుతూ పాతపాటి సర్రాజు నిబద్ధతతో వైసిపికి ఎనలేని సేవలందించారని గుర్తు చేశారు. రాష్ట్ర క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి వెంకట శ్రీనివాసరాజు(వాసు) మంత్రి ప్రసాదరావుకు శాలువా కప్పి సత్కరించారు. మంత్రి వెంట భీమవరం ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్, జిల్లా పరిషత్ ఛైర్మన్ కవురు శ్రీనివాస్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు, టిటిడి మాజీ బోర్డు సభ్యులు గోకరాజు రామరాజు, వైసిపి నాయకులు కుమార్ దత్తాత్రేయ వర్మ, గాదిరాజు సుబ్బరాజు, మేకా పార్వతి, ఆర్‌డిఒ దాసి రాజు, జిల్లా సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు కొలుకులూరి ధర్మరాజు, ఆకివీడు మున్సిపల్ ఛైర్‌పర్సన్ జామి హైమావతి ఉన్నారు.

ఉపాధిహామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

ఎపి వ్యకాస నేతలు

ప్రజాశక్తి - ఇరగవరం

నినదిస్తున్న ఉపాధి కార్మికులు

కూలీలకు ఎంతో ఉపయోగకరమైన ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఇరగవరం మండలం రేలంగి పంచాయతీ పరిధిలోని బొబ్బరాజుపాలెంలో పని చేస్తున్న కూలీలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీలో ఏన్నోఏళ్లుగా పని చేస్తున్నప్పటికీ తమకు పనిముట్లు ఇవ్వడం లేదని, చేసిన పనికి సకాలంలో వేతనాలు చెల్లించడం లేదని, ఎండలు అధికంగా ఉండటం వలన రెండు పూటల పని చేయడం సాధ్యం కావడం లేదని కూలీలు వీరభద్రరావుకు చెప్పి వాపోయారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో నెలకొన్న సంక్షోభం వంటి సంక్లిష్ట పరిస్థితుల్లో గ్రామీణ కూలీలకు వెన్నుదన్నుగా ఉన్న ఉపాధి హామీని సమర్థవంతంగా అమలు చేసి అడిగిన వారందరికీ పని కల్పించి వలసలు నివారించాలని కోరారు. దేశంలో మోడీ ప్రభుత్వం వచ్చిన నాటి నుండి ఎన్నడూ లేనివిధంగా నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీలకు మాత్రం కూలి పెరగడం లేదని వాపోయారు. కార్యక్రమంలో దాకే ముసలయ్య, త్రిపురా చంటి, పాటూరి జాన్, తాటిపాక సువర్ణమ్మ, త్రిపురాల చిట్టబ్బాయ్, దాయం సుందరి, పాటూరి శారా, తాటిపాక సరోజని, బందెల సంజీవయ్య పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: ఉపాధి కూలీల పట్ల బ్యాంకు అధికారులు తీరు మారకపోతే వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బ్యాంకు వద్ద ఆందోళన చేపడతామని ఎపి వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు హెచ్చరించారు. ఉపాధి హామీ పర్యటనలో భాగంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సోమవారం మాధవరంలో ఉపాధి పని ప్రదేశంలో పర్యటించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ మాధవరంలోని బ్యాంకు సిబ్బంది కూలీల పట్ల చులకనభావంతో మాట్లాడుతూ కించపరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి పని డబ్బులు జమయ్యాయో లేదని పోస్టింగ్ వేయమని అడిగితే అధికారులు వేయకుండా చులకనగా మాట్లాడుతున్నారని నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై సోమరాజు మాట్లాడుతూ గతంలో కూడా ఈ సమస్య వచ్చిందని, అధికారుల వైఖరిలో మార్పు లేదని అన్నారు. ఇప్పటికైనా బ్యాంకు అధికారులు వైఖరి మార్చుకోకపోతే బ్యాంకు వద్ద ఆందోళన చేపడతామని ప్రకటించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షురాలు తెగిరిపల్లి పాపారత్నం, నేతలు తానేటి నాగేశ్వరరావు, ఇంటి సత్యనారాయణ, ఉప్పాటి వెంకట్రావు, లక్కాకుల సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి జాతీయస్థాయి నాటిక పోటీలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఈ నెల 27, 28, 29, 30 తేదీల్లో భీమవరంలోని డిఎన్‌ఆర్ కళాశాల క్రీడా మైదానంలో 16వ జాతీయస్థాయి నాటిక పోటీలను నిర్వహిస్తున్నట్లు చైతన్య భారతి నాటక పరిషత్ అధ్యక్షులు రాయప్రోలు భగవాన్ తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత బ్రోచర్‌ను ఆవిష్కరించారు. 27న మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధ ప్రసాద్, రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక సేవాసమితి ఛైర్‌పర్సన్ వంగపండు ఉష ఈ పోటీలను ప్రారంభిస్తారని తెలిపారు. ముఖ్యఅతిథిగా సినీనటులు శుభలేఖ సుధాకర్ హాజరవుతున్నారు. 27న సినీ సంగీత దర్శకులు సాలూరి కోటేశ్వరరావు (కోటి)కు ఆత్మీయ చైతన్య పురస్కారం, ప్రగతి కళామండలి నాటక ప్రయోక్త నూతలపాటి సాంబయ్యకు జవ్వాది రంగస్థల చైతన్య పురస్కారం, సినీనటి కె.విజయలక్ష్మికి పెనుపోతుల శేషగిరిరావు హార్దిక చైతన్య పురస్కారం, 30న సినీనటులు పెన్మెత్స సుబ్బరాజుకు ఆత్మీయ చైతన్య పురస్కారం, పద్మశ్రీ డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖులేకు అనురాగ చైతన్య పురస్కారం, సినీనటులు సుబ్బరాయశర్మకు హార్దిక చైతన్య పురస్కారం, అల్లూరి సీతారామరాజు స్మారక కళావేదిక నాటక ప్రయోక్త పంపన దయానందబాబుకు రాయప్రోలు రామచంద్రమూర్తి రంగస్థల చైతన్య పురస్కారం, నటులు, దర్శకుడు ఎన్.రవీంద్రరెడ్డికి మైనంపాటి శ్రీరంగనాయకులు ఆత్మీయ చైతన్య పురస్కారం అందిస్తున్నామని వివరించారు. ఈ నెల 30న ఆనంద ఇన్ ఫంక్షన్ హాల్లో పద్మశ్రీ డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖులేచే ‘గుండెచప్పుడు’ ఆరోగ్యంపై కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. పోటీల్లో నాలుగు రోజులపాటు ఎనిమిది నాటికలను ప్రదర్శిస్తారని తెలిపారు. 27న ఉషోదయ కళానికేతన్ వారి ‘ప్రక్షాళన’, 28న అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారి ‘వెండిఅంచులు’, పండు క్రియేషన్స్ ‘పక్కింటి మొగుడు’, మద్దుకూరి ఆర్ట్ క్రియేషన్స్ ‘మృత్యుపత్రం’, 29న శ్రీసాయి ఆర్ట్స్ ‘ప్రేమతో నాన్న’, శార్వాణి సాంస్కృతిక సేవాసంఘం ‘కొత్త పరిమళం’, మణికంఠ ఆర్ట్స్ ‘కొత్తతరం కొడుకులు’, 30న అభినయ ఆర్ట్స్ ‘గుప్పెడంత గుండెల్లో’ నాటికలను ప్రదర్శిస్తారని తెలిపారు. సమావేశంలో చైతన్య భారతి కార్యదర్శి మంతెన రామ్‌కుమార్‌రాజు, రాయప్రోలు శ్రీనివాసమూర్తి, భట్టిప్రోలు శ్రీనివాస్, వడుపు గోపి, పెన్నాడ శ్రీను, కాగిత వెంకట రమణ, నడింపల్లి వెంకట రామరాజు, వబిలిశెట్టి శ్రీవెంకటేశ్వర్లు, బొండా రాంబాబు, సోనోవిజన్ రమణమూర్తి, కొండేటి శివకుమార్, లక్ష్మణవర్మ, చుక్కనశ్రీ, బాబ్జీ పాల్గొన్నారు.

క్లీన్ అండ్ గ్రీన్‌లో విస్సాకోడేరు బెస్ట్

కలెక్టర్ చేతుల మీదుగా సర్పంచి బొల్ల శ్రీనివాస్‌కు పురస్కారం

ప్రజాశక్తి - పాలకోడేరు



సర్పంచి, కార్యదర్శులను ప్రశంసిస్తున్న గ్రామస్తులు, ప్రముఖులు

పారిశుధ్య నిర్వహణ (క్లీన్ అండ్ గ్రీన్)లో విస్సాకోడేరు గ్రామానికి జిల్లా బెస్ట్ అవార్డు లభించింది. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి చేతుల మీదుగా ఆ గ్రామ సర్పంచి బొల్ల శ్రీనివాస్ సోమవారం అవార్డు అందుకున్నారు. విస్సాకోడేరు గ్రామాన్ని దీర్ఘకాలం నుంచి పారిశుధ్య సమస్య వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో సర్పంచిగా శ్రీనివాస్ పదవీ బాధ్యతలు చేపట్టిన రెండేళ్లలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి పంచాయతీ పాలకవర్గ సభ్యులు, అధికారులు, గ్రామస్తుల సహకారంతో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం (ఎస్‌డబ్ల్యుపిసి షెడ్)ను నిర్మించారు. దీంతో పారిశుధ్య సమస్య పరిష్కారమైంది. ఇంటింటా తడి పొడి చెత్త డబ్బాలను పంపిణీ చేసి చెత్త సేకరణ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు జిల్లా లోకల్ సెంటర్‌గా ఇఎస్‌డబ్ల్యుపిసి షెడ్‌ను ఎంపిక చేసి ఏడు మండలాలు 42 గ్రామాలకు సంబంధించిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, క్లాప్ మిత్రాలు, సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కేంద్రాన్ని కలెక్టర్ ప్రశాంతి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జిల్లాలో పారిశుధ్య నిర్వహణలో ఉత్తమ ఫలితాలు సాధించిన విస్సాకోడేరు గ్రామాన్ని జిల్లా బెస్ట్ అవార్డుకు అధికారులు ఎంపిక చేశారు. భీమవరం కలెక్టరేట్లో కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా సర్పంచి బొల్ల శ్రీనివాస్‌కు అవార్డు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలో అందరి సహకారంతో తాను చేసిన కృషి ఫలితంగా అవార్డు దక్కిందన్నారు. ఈ అవార్డు తనపై మరింత బాధ్యత పెంచిందని చెప్పారు. గ్రామాభివృద్ధికి పాలవర్గ సభ్యులు, అధికారులు, గ్రామస్తులు, వివిధ పార్టీల నాయకులు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు.

సర్పంచి శ్రీనివాస్‌కు అభినందనలు

జిల్లాస్థాయి అవార్డు అందుకున్న సర్పంచి బొల్ల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి జార్జ్ ప్రసాద్‌లను పలువురు అభినందించారు. పలువురు ప్రముఖులు సర్పంచి శ్రీనివాస్‌కు పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు. భీమవరం కలెక్టరేట్ వద్ద ఉప సర్పంచి కందుల నాగరాజు, పాలకవర్గ సభ్యులు చుండూరి అంజిబాబు, చందు, తుల చంద్రరావు, గ్రామస్తులు రిచ్చి జాన్ కిడ్స్, ఉండు శ్రీను, అశోక్, చేబోలు బాలాజీ, కామేష్ సర్పంచి శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక దృష్టి : సర్పంచి

ఉండి:గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుదలకు ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామ సర్పంచి సూరవరపు కనకదుర్గ వెంకటాచార్యులు అన్నారు. ఇటీవల ఎన్ఆర్‌పి అగ్రహారంలో నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు దృష్టికి ఎస్‌సి కాలనీ మహిళలు డ్రైనేజీ సమస్యను తీసుకెళ్లారు. స్పందించిన పివిఎల్ సమస్యను పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ ఈ కార్యక్రమం పూర్తయిన ప్రతి సచివాలయానికీ రూ. 20 లక్షల నిధులు గ్రామ అభివృద్ధికి ముఖ్యమంత్రి మంజూరు చేసినట్లు తెలిపారు. పివిఎల్ ఇచ్చిన హామీ మేరకు రూ.3.50 లక్షలతో ఎస్‌సి కాలనీలో డ్రైనేజీల నిర్మించి పారిశుధ్య సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

శ్రీజ పుట్టినరోజు సందర్భంగా అన్నదానం

పాలకొల్లు:ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు కుమార్తె శ్రీజ పుట్టినరోజు సందర్భంగా సోమవారం అన్నా క్యాంటీన్ వద్ద 855వ రోజు పేదలకు భోజనాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వాసుపత్రి వద్ద మొబైల్ క్యాంటీన్ ద్వారా రోగులకు భోజనాలు ఏర్పాటు చేశారు. అనంతరం ఎంఎల్ఎ పేదలకు స్వీట్లు, ఐస్‌క్రీమ్‌లు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, జివి, పాలవలస తులసీరావు, మేడిశెట్టి కేశవ పినిని రాము పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సుప్రజ నాట్య ప్రదర్శన

భీమవరం రూరల్ : తన మనవరాలు చెరుకువాడ సుప్రజ ఆస్ట్రేలియా మెల్‌బోర్న్‌లోని మెజెస్ ఫర్ ఫార్మింగ్ సెంటర్ లయోలా కాలేజ్ ఆడిటోరియంలో చేసిన భరతనాట్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుందని సోమవారం సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి తెలిపారు. భారతీయులు, తెలుగువారు సుమారు 300 మంది ఆ నాట్యాన్ని తిలకించి అభినందించారని తెలిపారు. వయొలిన్ ప్రైవి రామన్, మృదంగం నందేష్ శివరాజా, వేణువు సురేష్ త్యాగరాజన్ సహకరించారు.

ఎంఎల్ఎ నిమ్మల తీరు సరికాదు : తాతాజీ

పాలకొల్లు:టిడిపి హయాంలో శంకుస్థాపన చేసి వదిలేసిన పనులను వైసిపి హయాంలో పూర్తిచేసి ప్రారంభోత్సవం చేస్తుంటే ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అక్కడికొచ్చి గొడవ చేయడం తగదని డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ చెప్పారు. సోమవారం ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టిడిపి హయాంలో సగంచెరువు వద్ద వంతెనకు శంకుస్థాపన చేసి రెండేళ్లయినా పూర్తి చేయలేకపోయారని చెప్పారు. వైసిపి అధికారం చేపట్టాక వంతెన పూర్తి చేసి ప్రారంభిస్తుంటే ఎంఎల్ఎ నిమ్మల వచ్చి పోలీసులతో గొడవపడి, టిడిపి జెండాలు కడుతూ గొడవ చేయడం సరికాదన్నారు. సమావేశంలో వైసిపి నేతలు కె.శ్రీనివాస్, రేలంగి శ్రీను, చెన్ను విజయ్, పాలపర్తి , పెన్మెత్స కృష్ణ పాల్గొన్నారు.

ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహక నిధులేవి?

కలిగొట్ల ఎంపిటిసి రుద్రరాజు యువరాజు

ఉండి:ఏకగ్రీవ గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రోత్సాహక నిధులేవని కలిగొట్ల ఎంపిటిసి రుద్రరాజు యువరాజు అధికారులను ప్రశ్నించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కలిగొట్ల ఎంపిటిసి రుద్రరాజు యువరాజు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఏకగ్రీవమయ్యే గ్రామ పంచాయతీల్లో 2000 లోపు జనాభా ఉన్న గ్రామ పంచాయతీలకు రూ.5 లక్షలు, 2000 పైబడి ఉన్న గ్రామ పంచాయతీలకు రూ.10 లక్షల ప్రోత్సాహక నిధులు అందిస్తామని అధికారులు తెలపడంతో తమ గ్రామంలో ప్రజలందరూ కలిసి గ్రామపంచాయతీ పాలకవర్గాన్ని ఎన్నికలు లేకుండా ఏకగ్రీవం చేశారన్నారు. అయితే సర్పంచి ఎన్నికలు జరిగి రెండు సంవత్సరాలైనా ఇప్పటివరకు ప్రభుత్వం ప్రోత్సాహక నిధులు అందించకుండా గ్రామ పంచాయతీలను గాలికొదిలేసిందన్నారు. వెంటనే నిధులు విడుదల చేసేలా తమ వినతులను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాలని రుద్రరాజు యువరాజు అధికారులను కోరారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

ఆచంట:విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందిన ఘటన ఆచంట పంచాయతీ పరిధి గొల్లపల్లి వారిచెరువులో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఆచంట పంచాయతీ పరిధి గొల్లపల్లివారి చెరువుకు చెందిన ఉండ్రాజువరపు లక్ష్మి (50) పశువులకు పచ్చగడ్డి కోసేందుకు సమీపంలోని పంట పొలానికి వెళ్లింది. పచ్చగడ్డి కోస్తున్న సమయంలో కరెంటు వైర్ కొడవలికి తగిలి ఆమె మెడకు చుట్టుకుంది. దీంతో లక్ష్మి అక్కడికక్కడే మతి చెందినట్లు తెలిపారు. మృతురాలికి భర్త, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఎస్ఐ రాజకుమార్ మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయాలి

పెంటపాడు:మండలంలో వరి కోతలు ప్రారంభమై సుమారు పది రోజులైనా ధాన్యం రాసులు బయటకు వెళ్లక రోడ్లపై, చేలల్లోనే ఉన్నాయని, దీంతో రైతులు ఆందోళన చెందుతున్నాడని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిర్ల పుల్లారెడ్డి, నాయకులు బంకురు నాగేశ్వరరావు, అల్లు సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించి ఉంటే ఎప్పటికప్పుడు ధాన్యం మిల్లులకు చేరేవని, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ధాన్యం ఎక్కడికక్కడ నిలిచిపోయిందని తెలిపారు. అకాల వర్షాల వల్ల ఎండబెట్టిన ధాన్యం కూడా తడిచిపోయిందని తెలిపారు. ఒకపక్క రైతు భరోసా కేంద్రాల్లో గోనె సంచుల్లేక రైతులు నానా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఎకరానికి 110 సంచులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు సబ్బేళ్ల వెంకటరెడ్డి, భయ్యా నాగేశ్వరరావు, గంగరాజు కాంతారావు ముత్యం, పెనగంటి దుర్గ, మీసాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మేడేను జయప్రదం చేయాలి

ఆచంట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న వారిలో అత్యధికం మహిళలే అని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్ అన్నారు. మేడే వారోత్సవాలను వాడవాడలా ఘనంగా నిర్వహించేందుకు సోమవారం స్థానిక భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో సిఐటియు మండల అధ్యక్షురాలు వైట్ల ఉషారాణి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గోపాలన్ మాట్లాడుతూ స్కీం వర్కర్ల సంక్షేమాన్ని ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. మండలంలో అన్ని గ్రామాలు, కార్మిక వాడల్లో సిఐటియు జెండాలు ఎగరవేయాలని పిలుపునిచ్చారు. ఆచంట కచేరీ సెంటర్ నుంచి కార్మికులు, కర్షకులు, అసంఘటిత రంగ కార్మికులు, రైతులు పార్టీ శ్రేయోభిలాషులు వేలాదిగా తరలివచ్చి ర్యాలీలో పాల్గొని మేడేను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి వద్దిపర్తి అంజిబాబు, భవనిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దాసిరెడ్డి కోటేశ్వరరావు, కార్యదర్శి కేతా నాగాంజనేయులు, చేతివృత్తుదారుల సంఘం నాయకులు తోటపల్లి సత్యనారాయణ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎన్.శర్మ, నాయకులు నిమ్మన వెంకట తాయారు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

వీరవాసరం:మండలంలో మేడే వారోత్సవాలను జయప్రదం చేయాలని సిఐటియు మండల కమిటీ పిలుపునిచ్చింది. సిఐటియు మండల కమిటీ సమావేశం సోమవారం డి.వరలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా నాయకుడు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ మేడే వారోత్సవాలు నిర్వహించాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించిందన్నారు. ఈ వారోత్సవాల్లో ఆటలు, పాటలు, సభలు, సమావేశాలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ మేడే స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అనంతరం మేడే వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో రైస్‌మిల్లర్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు కొత్తల సత్తిబాబు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు పి.నాగరత్నం, మిడ్ డే మీల్స్ వర్కర్స్ యూనియన్ నాయకురాలు రత్నకుమారి, శాంతికుమారి, మంగమ్మ, పార్వతి పాల్గొన్నారు.

భూగర్భ జలాల పరిరక్షణకు తీర్మానం

కాళ్ల:ఏలూరుపాడులో తాగునీటి వనరులను పరిరక్షించాలని గ్రామస్తులు ఇటీవల గ్రామ సర్పంచి, పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఏలూరుపాడు గ్రామ కార్యాలయంలో గ్రామస్థుల అభ్యర్థన మేరకు పంచాయతీ సాధారణ సమావేశం సర్పంచి భూపతి రాజు వెంకట జగ్గరాజు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో భూగర్భ జలాల పరిరక్షణకు సర్వే నంబర్ 225 నుండి 248 వరకూ పంచాయతీ తాగునీటి చెరువుకు అనుకుని ఉన్న పంట భూముల్లో ఆక్వా చెరువుల తవ్వకాలు నిలిపివేయాలని, తాగునీటి చెరువును, భూగర్భ జలాలను పరిరక్షించాలని పంచాయతీలో తీర్మానం చేశారు. గ్రామ సర్పంచి భూపతి జగ్గరాజు, ఉపసర్పంచి నల్లగచు ధనలక్ష్మి, పంచాయతీ వార్డు సభ్యులు వరలక్ష్మీ, ఆంజనేయులు, తలగల్ల సుబ్బారావు, సామన కమలకుమరి, చిన్న అమ్ములు తీర్మానం చేశారు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం

గొరగనమూడి సర్పంచి శివాజీ రాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

మండుటెండలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో దోహదపడతాయని గొరగనమూడి గ్రామ సర్పంచి గొట్టుముక్కల వెంకట శివరామరాజు (శివాజీరాజు) అన్నారు. స్థానిక బస్టాండ్ వద్ద గొరగనమూడి గ్రామ పంచాయతీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని సోమవారం సర్పంచి శివాజీ రాజు ప్రారంభించి గ్రామస్తులకు, స్థానికులకు, సచివాలయ అధికారులకు, ప్రయాణికులకు మజ్జిగ అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచి శివాజీరాజు మాట్లాడుతూ ప్రస్తుతంలో

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచి శివాజీ రాజు

ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నాయని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు వహించాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఎ. పోలయ్య మాట్లాడుతూ పంచాయతీ, గ్రామస్తుల సహకారంతో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చలివేంద్రం నిర్వహణకు దాతలు మరింత సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచి జి.రామాంజనేయులు, మాజీ ఉప సర్పంచి దొంగ సురేష్, వైసిపి నేతలు బొక్కా ప్రసాద్, పి.రామకృష్ణ, విఆర్ఒ శ్రీనివాస్, ఎఎన్ఎం వేదకుమారి, వెల్ఫేర్ అసిస్టెంట్ గోపాలకృష్ణ, మహంకాలరావు పాల్గొన్నారు.

వల్లూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఆచంట :రైతు సంక్షేమం కోసం అహర్నిశలూ కృషి చేస్తున్న ఏకైక నాయకులు ముఖ్యమంత్రి జగన్ అని ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య అన్నారు. వల్లూరు సహకార సంఘం ఆధ్వర్యంలో రైతు భరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం చిల్లే లావణ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ధాన్యం కొనుగోలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కొనుగోలు చేసిన 21 రోజుల్లో రైతు ఖాతాలో నగదు జమ చేసే విధంగా కృషి చేస్తామన్నారు. రైతులంతా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు నారిన వీర వెంకట సత్యనారాయణ, డైరెక్టర్లు గంగోలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

98 క్వాలిఫైడ్ టీచర్లకు నియామకపత్రాలు అందజేత

పెనుమంట్ర:డిఎస్‌సి 1998 క్వాలిఫైడ్ టీచర్లకు మినిమం టైం స్కేల్ ప్రాతిపదికన ఐదు చోట్ల విధుల్లో చేర్చినట్లు ఎంఇఒ డి.శారదా జ్యోత్స్న తెలిపారు. సోమవారం ఎంఇఒ కార్యాలయంలో ఉపాధ్యాయులకు ప్రాతిపదికన నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా శారదాజ్యోత్స్న మాట్లాడుతూ పెనుమంట్రలోని పెద్దచెరువు గట్టు వద్ద మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల , మాముడూరులోని బొక్కావారిపాలెంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, వెలగలవారిపాలెం ఎస్‌టి ఏరియాలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, మాముడూరు చిట్టి మట్లగరువు ఏరియాలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వారిని నియమించినట్లు తెలిపారు.

‘80 వేల ఇళ్లకు స్టిక్కర్లు అతికించడమే లక్ష్యం’

కాళ్ల:ఈ నెల 29వ తేదీ వరకూ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఉన్న దృష్ట్యా అనుకున్న లక్ష్యసాధనకు నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, వాలంటీర్లు సమిష్టి కృషి చేయాలని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. పెదఅమిరం గ్రామంలో వైసిపి కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పివిఎల్ నరసింహరాజు మాట్లాడుతూ 80 వేల ఇళ్లకు జగనన్న స్టిక్కర్లు అతికించాలనే లక్ష్యాన్ని చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాళ్ల, ఉండి జెడ్‌పిటిసిలు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, రణస్థుల కనకదుర్గ మహంకాళి, ఎంపిపిలు పాల్గొన్నారు.

మిల్లర్లు రైతులను ఇబ్బంది పెట్టొద్దు : తహశీల్దార్

గణపవరం:ధాన్యం దిగుమతి విషయంలో రైస్‌మిల్లర్లు రైతులను ఇబ్బంది పెట్టొద్దని తహశీల్దార్ పమ్మి లక్ష్మి అన్నారు. సోమవారం గణపవరం ఎఒ వై.ప్రసాద్, విఆర్ఒ ఎ.ప్రసాద్‌తో కలిసి వరదరాజపురం, వెలగపల్లి గ్రామాల్లోని రైస్‌మిల్లులను పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రస్తుతం రబీ ధాన్యంలో నూక శాతం 30 నుండి 40 శాతం వరకు రావడంతో మిల్లర్లు ధాన్యం దిగుమతి విషయంలో రైతులను ఇబ్బంది పెడుతున్నరన్నారు. నూక శాతం సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని, ధాన్యం దిగుమతి విషయంలో రైతులను ఇబ్బంది పెట్టొద్దని అన్నారు. రవాణా ఛార్జీలు సరిపోవడం లేదనే రైతుల ఆవేదనను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

విద్యార్థులకు భోజనం ప్లేట్లు అందజేత

వీరవాసరం:దాత సహకారంతో విద్యార్థులకు భోజనం ప్లేట్లు సమకూరాయి. వీరవల్లిపాలెం సర్పంచి శీలబోయిన పద్మకుమారి తన భర్త శీలబోయిన పాటేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన పుట్టిన రోజును పురస్కరించుకుని గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ విద్యార్థులకు సోమవారం 80 ప్లేట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో శీలబోయిన నిరంజన్, ప్రధానోపాధ్యాయుడు నడపన దుర్గారావు, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ శీలబోయిన పవన్‌కుమార్, ఉపసర్పంచి జి.రాంప్రసాద్, మాజీ సర్పంచి కె.ఈశ్వరి, ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కంచాలు అందజేస్తున్న దాత

బిజెపి విధానాలు దేశానికి ప్రమాదకరం : సిపిఎం

భీమవరం :బిజెపి మతోన్మాద, ప్రయివేటీకరణ విధానాలు దేశానికి ప్రమాదకరమని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం తెలిపారు. స్థానిక ప్యాడి అండ్ రైస్ మర్చంట్స్ హాల్లో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు అధ్యక్షతన సిపిఎం రాజకీయ శిక్షణా తరగతులు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాం ముఖ్యవక్తగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజావ్యతిరేక విధానాలను అనుసరిస్తోందన్నారు. మైనార్టీలు, దళితులు, మహిళలు, గిరిజనులు, ప్రజల పట్ల ఆరెస్సెస్, సంఘ్ పరివార్ శక్తులు నిరంకుశంగా వ్యవహరిస్తున్నాయన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటుపరం చేసేందుకు కుయుక్తులు పన్నుతోందని విమర్శించారు. టిడిపి, జనసేన వారి రాజకీయ వైఖరిని పునరాలోచించుకోవాలన్నారు. ముందుగా సిపిఎం జెండాను సిపిఎం జిల్లా సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి ఎగురవేశారు. ఈ శిక్షణ తరగతుల్లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్ ‘సిపిఎం 23వ అఖిల భారత మహాసభల రాజకీయ తీర్మానం’, చింతకాయల బాబూరావు ‘ నయా ఉదారవాద ఆర్థిక విధానాలు – ప్రజలపై ప్రభావం’ అనే అంశాలను బోధించారు.

తాండ్ర పాపారాయుడుకు మంత్రి ధర్మాన నివాళి

పాలకోడేరు :శృంగవృక్షం చింతల వద్ద తాండ్రపాపారాయుడు విగ్రహానికి మంత్రి ధర్మాన ప్రసాదరావు పూలమాలవేసి నివాళులర్పించారు. జిల్లా పర్యటనకు సోమవారం విచ్చేసిన మంత్రి ధర్మాన ప్రసాదరావుకు వైసిపి నాయకులు, కుల సంఘం నేతలు ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి వెంట జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్, శృంగవృక్షం గ్రామ కన్వీనర్ జి.పాండురంగారావు, సొసైటీ మాజీ ఛైర్మన్ ఎస్. రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

రైల్వేగేటు మరమ్మతులు ప్రారంభం

పాలకొల్లు:పాలకొల్లు రైల్వే గేటు మరమ్మతు పనులు సోమవారం ఉదయం ప్రారంభించారు. దీంతో రైల్వేగేటు మూసివేశారు. రైల్వే అధికారుల నిర్ణయం మేరకు ఈ నెల 27వ తేదీ గురువారం ఉదయం 8 గంటలకు గేటు తిరిగి తెరుస్తారు. రైల్వే క్వార్టర్స్ నుంచి మురుగు నీరు వెళ్లేందుకు రెండు పెద్ద సిమెంట్ పైపులు పెట్టడంతోపాటు ఓ ట్రాక్‌పై ఐరన్ షీట్లు వేస్తున్నట్లు రైల్వే అధికారి ఒకరు తెలిపారు. దీంతో ఎప్పుడూ రద్దీగా ఉండే పిపి రోడ్ బోసిపోయింది.


సీసలి గ్రామ సర్పంచి బిల్వకుర్తి ధనలక్ష్మి శ్రీనివాస్ దంపతులను సత్కరిస్తున్న ఎంపిపి శిరీష విశ్వనాథరాజు

పెనుమంట్ర : అవార్డులు అందుకుంటున్న సర్పంచులు

గ్రామాలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

జిల్లాలో గ్రామ పంచాయతీలకు పురస్కారాలు

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రతి గ్రామమూ ఆర్థిక స్వావలంబన సాధించాలని ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు) అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ రాజ్ దినోత్సవం ఎంపిపి చంటిరాజు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన తొమ్మిది అంశాల సర్వేలో మండలంలో 14 గ్రామాలకు గాను 11 గ్రామాలకు 27 అవార్డులు లభించాయి. దీనిలో పారిశుధ్య నిర్వహణకు సంబంధించి విస్సాకోడేరు గ్రామ పంచాయతీకి జిల్లాస్థాయిలో ప్రథమ అవార్డు లభించింది. అవార్డులకు ఎంపికైన గ్రామ పంచాయతీల సర్పంచులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపిపి చంటిరాజు అవార్డులు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మండల పరిషత్తు అభివృద్ధి అధికారి మురళీగంగాధర్, మండల విస్తరణ అధికారి రెడ్డియ్య, ఎంపిపి చంటిరాజు మాట్లాడారు. అనంతరం ఎంపిపి చంటిరాజును అధికారులు, ప్రజాప్రతినిధులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప ఎంపిపిలు నరేష్, ఆదాడ లక్ష్మీ తులసి, సర్పంచులు జంగం సూరిబాబు, కడలి నాగేశ్వరి, మరియమ్మ, చిత్తపల్లి వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

మొగల్తూరు : ప్రజా సమస్యలు తీర్చిన ప్రజా ప్రతినిధులకు ఎప్పుడూ గౌరవం ఉంటుందని జెడ్‌పిటిసి సభ్యులు తిరుమాని బాపూజీ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 9 విభాగాల్లో ఉత్తమ ఫలితాలు కనబర్చిన 8 పంచాయతీలకు అవార్డులు అందించారు. మొగల్తూరు 2, మోడీ 2, ముత్యాలపల్లి నాలుగు, రామన్నపాలెం 3 ,కాళీపట్నం తూర్పు 6, కొత్తట 1, శేరేపాలెం నాలుగు, పేరుపాలెం సౌత్ 5 పంచాయతీలు అవార్డులు గెలుచుకున్నాయన్నారు. ఆయా గ్రామాల సర్పంచులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను ఎంపిడిఒ ఆర్‌సి ఆనంద్ కుమార్, జెడ్‌పిటిసి తిరుమల బాపూజీ, వైస్ ఎంపిపి సుబ్బారావు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి నవీన్ కిరణ్, ఎఎంసి వైస్ ఛైర్మన్ కటికల సూర్యారావు పాల్గొన్నారు.

ఆచంట:గ్రామాల్లో అందుబాటులోని వనరుల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి అన్నారు. మండలంలో ప్రపంచ పంచాయతీ రాజ్ దినోత్సవంలో భాగంగా ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచులకు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. మండలంలో 9 థీమ్స్‌లో ఒక్కో థీమ్స్ నందు మూడు గ్రామ పంచాయతీల చొప్పున 27 అవార్డులు వచ్చినట్లు ఎంపిడిఒ విఎస్‌విఎల్ జగన్నాథరావు తెలిపారు. మండలంలో కరుగోరుమిల్లి, పెదమల్లం, శేషమ్మచెరువు, వల్లూరు, పెనుమంచిలి, భీమలాపురం కందరవల్లి, ఆచంట వేమవరం, కోడేరు, ఆచంట, అయోధ్య లంక, కోడేరు, పంచాయతీల్లో ఎన్నికైన గ్రామ సర్పంచులు, కార్యదర్శులను ఎంపిపి, జెడ్‌పిటిసి పురస్కారాలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు నేలపూడి బేబీ రామ్మోహన్‌రావు, గుబ్బల మాధవరావు, అల్లం పద్మావతి, కార్యదర్శులు, జివివి సత్యనారాయణ పాల్గొన్నారు.

జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా కొడమంచిలి పంచాయతీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులను సత్కరించినట్లు సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి షేక్ హినా భాను, సచివాలయం, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పెనుమంట్ర:గ్రామ పంచాయతీలకు అవార్డుతోపాటు ప్రభుత్వం గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తే మరింత ప్రోత్సాహకరంగా ఉంటుందని జుత్తిగ సర్పంచి, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షుడు తమనంపూడి వీర్రెడ్డి అన్నారు. సోమవారం గ్రామ పంచాయతీ రాజు దినోత్సవం సందర్భంగా ఆయా శాఖల పనితీరు పట్ల వివిధ స్థాయిలో పంచాయతీ సర్పంచులను సత్కరించారు. ఈ సందర్భంలో పెనుమంట్ర సర్పంచి తాడిపర్తి ప్రియాంక మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగుల కృషితో ప్రజలకు మరిన్ని సేవలందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెండో వైస్ ఎంపిపి ఈది అనిత, ఎంపిడిఒ వి.పూర్ణబాబ్జి, ఇఒపిఆర్‌డి రాంప్రసాద్, సర్పంచులు పాల్గొన్నారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా నెలమూరు గ్రామ పంచాయతీకి రాష్ట్రస్థాయిలో రెండో స్థానం వచ్చిన నేపథ్యంలో బాలల స్నేహపూర్వక గ్రామం పేరున అవార్డును కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా నెలమూరు సర్పంచి కుచ్చర్లపాటి మంగతాయారు అందుకున్నారు. భీమవరం కలెక్టరేట్‌లో అవార్డు అందజేశారు.

అత్తిలి:గ్రామ పంచాయతీలకు దశలవారీగా జిల్లా, మండల స్థాయి థీమ్ వారీగా అవార్డులు రావడం అభినందనీయమని ఎంపిపి మక్కా సూర్యనారాయణ అన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో జిల్లా, మండల స్థాయి థీమ్ వారీగా వార్డు పొందిన సర్పంచులకు ఎంపిడిఒ వివివి ఎస్.రామారావు ఆధ్వర్యంలో సర్పంచులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయిలోని థీమ్ 3 పిల్లల స్నేహ పూర్వక గ్రామ పంచాయతీగా ఉరదాళ్లపాలెం, థీమ్ 5కు పారిశుధ్యం, హరిత గ్రామ పంచాయతీగా దంతుపల్లి, థీమ్ 7గా సామాజిక భద్రత కలిగిన గ్రామ పంచాయతీగా మంచిలి, థీమ్ 8గా సుపరిపాలన కలిగిన గ్రామ పంచాయతీగా దంతుపల్లికి అవార్డులు వచ్చాయని చెప్పారు. అలాగే మండల స్థాయిలో థీమ్1లో మెరుగైన జీవనోపాధి గల గ్రామ పంచాయతీలుగా ఉరదాళ్లపాలెం, గుమ్మంపాడు, పాలి, థీమ్ 2లో ఆరోగ్యకరమైన గ్రామ పంచాయతీగా పాలి, ఉరదాళ్లపాలెం, మంచిలి, థీమ్ 3లో పిల్లల స్నేహపూర్వక గ్రామ పంచాయతీలో ఉరదాళ్లపాలెం, దంతుపల్లి, పాలూరు, థీమ్4లో నీటి సమృద్ధి కలిగిన గ్రామ పంచాయతీగా పాలి, మంచిలి, ఆరవల్లి గ్రామాలు ఎంపికయ్యాయి. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ బుద్ధరాజు భరణీప్రసాద్, జెడ్‌పిటిసి అడ్డాల జానకి, కో ఆప్షన్ సభ్యులు అబీరుద్దీన్, సర్పంచులు పాల్గొన్నారు.

ఉండి:మండల స్థాయిలో యండగండి గ్రామానికి అవార్డుల పంట పండింది. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి అడబాల వెంకట అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన పంచాయతీరాజ్ దినోత్సవం కార్యక్రమంలో మండల స్థాయిలో 9 రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన గ్రామ పంచాయతీలకు ప్రశంసా పత్రాలను మండల పరిషత్ అధ్యక్షులు ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు అందజేశారు. ఈ సందర్భంగా మండలంలో 9 రంగాలకు గాను ఐదు రంగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన యండగండి గ్రామ పంచాయతీ సర్పంచి గోగులమండ చిన్న కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి కెఎస్ఎస్ రామలక్ష్మిని పలువురు అభినందించారు. ఈ సందర్భంగా యండగండి సర్పంచి చిన్న కృష్ణమూర్తి మాట్లాడారు. మండలంలోని కోలమూరు, వాండ్రం, ఎన్ఆర్‌పి అగ్రహారం, ఉనుదుర్రు రెండేసి రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన గ్రామాలుగా నిలిచాయి.

కాళ్ల : గ్రామ పంచాయతీల అభివృద్ధితోనే గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధ్యపడుతుందని ఎంపిపి పెన్మత్స శిరీష విశ్వనాథరాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించారు. మండలంలో 12 ఉత్తమ పంచాయతీలను ఎన్నుకున్నారు. 12 పంచాయతీల్లో సీసలి పంచాయతీ ప్రథమస్థానంలో ఉంది. సీసలి ఏడు అంశాల్లో, కాళ్ల నాలుగు, కోపల్లె మూడు, ప్రాతళ్లమెరక, దొడ్డనపూడి, వేంపాడు, బొండాడ పంచాయతీలు రెండు అంశాల్లో, జువ్వలపాలెం, ఎస్‌సి బోస్ మాజీ సైనిక్ కాలనీ, కాళ్లకూరు, బొండాడ పేట, పెదఅమిరం ఒక్కో ఒక్క అంశాల్లో ప్రగతి సాధించి అవార్డులు అందుకున్నాయి. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ అన్ని రంగాల్లో గ్రామాలు అభివృద్ధి చెందుతే తద్వారా దేశం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేసిన పంచాయతీ కార్యదర్శులకు ప్రశంసాపత్రాలు, అవార్డులు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.స్వాతి, ఇఒపిఆర్‌డి ఎంవి.భాస్కరరావు, ఎఒ ఎంఎస్ ప్రభాకర్, సర్పంచులు పాల్గొన్నారు.

నిధులు పంచాయతీ ఖాతాలకు జమచేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కేంద్రం నుంచి వివిధ గ్రాంట్ల రూపంలో వచ్చే నిధులను నేరుగా ఆయా గ్రామ పంచాయతీల ఖాతాలకు జమ చేయాలని పెదతాడేపల్లి గ్రామ సర్పంచి పోతుల అన్నవరం డిమాండ్ చేశారు. పెద్దతాడేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించారు. కేంద్రం నిధులను నేరుగా గ్రామ పంచాయతీల ఖాతాలకు జమ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ గ్రామ సభ ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించింది. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడారు. కేంద్రం నుంచి గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులను నేరుగా ఆయా గ్రామ పంచాయతీల ఖాతాలకు జమ చేసేందుకు కేంద్రం ఆదేశాల మేరకు ఏడాది క్రితమే ప్రత్యేక ఖాతాలను ప్రారంభించామన్నారు. అయినప్పటికీ నేటికీ కేంద్ర నిధులు పంచాయతీ ఖాతాలకు నేరుగా జమ కాకపోవడం విచారకరమన్నారు. దీంతో గ్రామ పంచాయతీలు ఆర్థికంగా నిర్వీర్యం అయిపోతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి పంచాయతీలకు ఇచ్చే నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలోని సిఎఫ్‌ఎంఎస్‌కు కాకుండా పంచాయతీలు ప్రత్యేకంగా ప్రారంభించిన పిఎఫ్‌ఎంఎస్ ఖాతాలకు జమ చేయాలని ఆయన కోరారు. సభలో పంచాయతీ ఉపసర్పంచి అత్తంటి సోమరాజు, ఎంపిటిసిలు కరుటూరి గోవిందరాజు, పసుమర్తి సత్యనారాయణ, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే ధ్యేయంగా పనిచేయాలి : ఎంఎల్ఎ

భీమవరం రూరల్:రైతుల శ్రేయస్సే ధ్యేయంగా సహకార సంఘాల పాలక వర్గాలు పనిచేయాలని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. తాడేరు సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌గా నియమితులైన కొట్టు త్రినాధరావు (నంబర్ 2) సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ సహకార సంఘాలకు నూతనంగా ఎన్నికైన త్రిసభ్య కమిటీలు క్షేత్రస్థాయిలో రైతులకు మరింత మేలు జరిగే విధంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, మాజీ ఎఎంసి ఛైర్మన్ ఏడుకొండలు పాల్గొన్నారు.

చర్చి నిర్మాణానికి సిమెంట్ బస్తాలు అందజేత

ప్రజాశక్తి - పోడూరు

మట్టపర్రు పంచాయతీ పరిధి అరుంధతీపేటలో నిర్మాణంలో ఉన్న చర్చికి ధర్మారావు ఫౌండేషన్ ద్వారా ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు సహకారంతో 50 సిమెంట్ బస్తాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు యేల్లమెల్లి వెంకట్రావు, కేతా సత్యనారాయణ, తంగెళ్ల శివ పాల్గొన్నారు.

HON’BLE FAMILY CUM V ADJ COURT AT VIJAYAWADA
IN FCOP NO. 1678/2021

Bhimavarapu Venkata Ratnam ...Petitioner
And
Vemuri (Bhimavarapu) Jayasri ...Respondent

శ్రీ భీమవరపు వెంకటరత్నం గారు శ్రీమతి వేమూరి (భీమవరపు) జయశ్రీ W/o వెంకటరత్నంగారు పైన విడాకుల కొరకు దావా 2021లో వేసియున్నారు. అప్పటి నుంచి దావాలో ప్రతివాది వారు నోటీసు అందుకోకుండా తాత్సారం చేయటం కారణం చేత ది.11-04-2023న పత్రికా ముఖంగా నోటీసుని ప్రచురించమని ఆర్డర్ వేసియున్నారు. కావున ప్రతివాది అయిన శ్రీమతి జయశ్రీ గారికి పత్రికముఖంగా నోటీసు జారీ చేయుచున్నాము. తదుపరి వాయిదా 16-05-2023, నాటికి తమరు స్వయంగా గాని తమరి తరఫున న్యాయవాది గాని కోర్టుకి హాజరు కావలెనని తెలియజేయడమైనది.

B.V.V.Suryanarayana,
Advocate for Petitioner,
Vijayawada
Ph No. 98488 64303.

In the Court of the I Additional Junior Civil Judge, Tanuku
O.S. 310/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya bank), Alamuru ***...Plaintiff***
Vs
Borra Kanaka Mahalakshmi another ***...Defendants***

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
1. బొర్రా కనక మహాలక్ష్మి, W/o. దశరథరావు, హిందువు, స్త్రీ, 47 సం॥లు, డో.నెం. 10-7, అడవిపాలెం, యలమంచిలి మండలం.
2. పజ్జూరి రమేష్, S/o. మల్లేశ్వరరావు, హిందువు, పురుషుడు, 39 సం॥లు, డో.నెం. 19-5-11, పాలకొల్లు.

పై నెంబరు దావా గ్రంథములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది. 27-04-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయముగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినది గాను, అట్లుకాని యెడల మీపై పరోక్షమున తీర్మానించ బడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.

N.RAVI SHANKAR
Advocate, Tanuku

In the Court of the I Additional Junior Civil Judge, Tanuku
O.S. 301/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya bank), Alamuru ***...Plaintiff***
Vs
Midde Swapna and another ***...Defendants***

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
1. మిద్దే స్వప్న, S/o. లక్ష్మణరావు, హిందువు, స్త్రీ, 45 సం॥లు, డో.నెం. 20-1-8, శంభునిపేట, పాలకొల్లు.
2. పీతాని సత్యనారాయణ, S/o. గాంధీ, హిందువు, పురుషుడు, 46 సం॥లు, డో.నెం. 21-8-11/ఎ, యడ్లబజార్, పాలకొల్లు.

పై నెంబరు దావా గ్రంథములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది. 26-04-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయముగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినది గాను, అట్లుకాని యెడల మీపై పరోక్షమున తీర్మానించ బడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.

N.RAVI SHANKAR
Advocate, Tanuku

In the Court of the I Additional Junior Civil Judge, Tanuku
O.S. 367/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya bank), Alamuru ***...Plaintiff***
Vs
Pajjuri Lakshmana Rao another ***...Defendants***

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
1. పజ్జూరి లక్ష్మణరావు, S/o. సూర్యనారాయణ, హిందువు, పురుషుడు, 44 సం॥లు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.
2. వేముల సూర్య వంశీధర్, S/o. చంద్రశేఖర్, హిందువు, పురుషుడు, 41 సం॥లు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.

పై నెంబరు దావా గ్రంథములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది. 26-04-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయముగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినది గాను, అట్లుకాని యెడల మీపై పరోక్షమున తీర్మానించ బడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.

D.S.V.KRISHNAJI
Advocate, Tanuku